# 1

# ఆత్మ విషయమైన దీనత్వం

## (మత్తయి 5:3)

మీ చేతికి ఒక కాగితాన్నిచ్చి మీ జీవితంలో మీరు చేరుకునే వాటిని వ్రాయమని అడిగారనుకోండి, మీరు ఏమి వ్రాస్తారు? చాలా విషయాలు వ్రాస్తారు కదా, కానీ చాలా మంది తమ జీవితంలో ఎక్కువగా కోరుకునేది ఏమిటో తెలుసా? అది *సంతోషం,* ఆనందం.

ఈ సంతోషాన్ని కనుగొనడానికి ప్రపంచంలోని వారు ఎన్నో పనులు చేస్తున్నారు, కానీ సంతోషమును కనుగొనడానికి సొలొమోనుకంటే ఎక్కువ ప్రయాసపడినవారు ఎవరూ లేరు. లోకపరమైన జ్ఞానం ద్వారా అతడు సంతోషాన్ని కనుగొనడానికి ప్రయత్నించాడు. అయితే ఆఖరకు అతడు చెప్పేదేమిటి?

> ... యెరూషలేమునందు నాకు ముందున్న వారందరికంటెను నేను చాలా ఎక్కువగా జ్ఞానము సంపాదించితిననియు, జ్ఞానమును విద్యను నేను పూర్ణముగా అభ్యసించితిననియు నా మనస్సులో నేననుకొంటిని. ... అయితే ఇదియు గాలికై ప్రయాసపడుటయే అని తెలిసికొంటిని. విస్తారమైన జ్ఞానాభ్యాసము చేత విస్తారమైన దుఃఖము కలుగును; అధిక విద్య సంపాదించినవానికి అధిక శోకము కలుగును (ప్రసంగి 1:16–18).

మందు, స్త్రీలు, ఆటపాటలు వంటి అన్ని రకాల సంతోషాల మీద సొలొమోను ప్రయోగం చేశాడు (ప్రసంగి 2:1, 8). సొలొమోను ఎంత ధనవంతుడయ్యాడంటే, అతని దినములలో "వెండిది యొకటియు లేదు" (1 రాజులు 10:21). అతడి భోజనములో క్రొవ్విన యెద్లు, విడియెద్లు, గొఱ్ఱెలు, ఎఱ్ఱ దుప్పులు, దుప్పులు జింకలు, బాతులు ఉండేవి (1 రాజులు 4:22, 23). అతడికి సంతోషం ఇచ్చేదిగా భావించిన ప్రతి దానిని సొలొమోను ప్రయత్నించి చూశాడు (ప్రసంగి 2:10). వీటన్నిటినుండి సొలొమోను ఏమి నేర్చుకున్నాడు? "అవన్నియు వ్యర్థమైనవిగాను, ఒకడు గాలికి ప్రయాసపడినట్లుగాను కనబడెను" (11బి వచనం). ఈ లోక మార్గములోని వాటిలో ఏ మాత్రము సంతోషం కనబడదు.

మనం మత్తయి 5:3–12లో వాక్య అధ్యయనాన్ని ప్రారంభిస్తున్నాము. ఈ వాక్య భాగంలో[1] నిజమైన సంతోషమునకుగల దేవుని రహస్యాన్ని మనం కనుగొంటాము. దీన్నే Hugo McCord "గ్యారంటీ సంతోషం"[2] అని పిలుస్తున్నాడు. ఈ వాక్య భాగాలనే "ధన్యతలు" అని పిలుస్తున్నారు. ఈ ధన్యతలు (Beatitudes) అనే పదం *beatus* అనే లాటిన్ పదంనుండి వచ్చింది. దీనికి "ధన్యులు" లేక "సంతోషం"[3] అని అర్థం. కొన్ని తర్జుమాలలో ప్రతి వచనం "blessed" అనే పదముతో ప్రారంభమవుతుంది.

"ధన్యతలు" అనే పదం *makarios* అనే గ్రీకు పదంనుండి వచ్చింది. దీనికి "ధన్యత, సంతోషం" అని అర్థం.[4] "ధన్యతలు" అను మాటకు బదులు "సంతోషం" అనే మాట ఉపయోగించడం తప్పుడు అనువాదం కాదన్న విషయాన్ని మనం గుర్తించాలి. ఫిలిప్స్ తర్జుమాలో మనం దీనిని చూస్తున్నాం:

దీన మనస్కులు ఎంత సంతోషంగా ఉంటారో, వారిదే పరలోక రాజ్యం!

దుఃఖమంటే ఏమిటో తెలిసినవారెంత సంతోషంగా ఉంటారో. వారు ఆదరణ పొందుతారు!

తమ నిమిత్తం దేనిని ఉంచుకొనని వారెంత సంతోషంగా ఉంటారో. ఈ లోకమంత వారిదే!

మంచి కొరకు ఆకలిదప్పిక ఉండేవారెంత సంతోషంగా ఉంటారో! వారు తృప్తిపొందుతారు.

దయచూపే వారెంత సంతోషంగా ఉంటారో, వారికి దయ చూపబడుతుంది!

నిజాయితీగల వారెంత సంతోషంగా ఉంటారో, వారు దేవున్ని చూస్తారు!

సమాధానముగా నుండేవారెంత సంతోషంగా ఉంటారో, వారు దేవుని పిల్లలని పిలువబడతారు!

మంచి నిమిత్తం హింసను భరించేవారెంత సంతోషంగా ఉంటారో, పరలోక రాజ్యం వారిదే!

"సంతోషం" అనే మాటను ఈ లోకం నిర్వసించినట్లుగా గాకుండా దీన్ని నిర్వచించుటకు మనం జాగ్రత్తపడాలి. సంతోషం (happiness) అనే పదం "hap" అనే పురాతన ఇంగ్లీషు పదంనుండి వచ్చింది. ఇది "ఒక సంఘటనను"[5] సూచిస్తుంది. ఒక వ్యక్తి తనకు జరిగిన సంఘటనల ఆధారంగా ఈ "సంతోషం" ఉంటుంది. "దేవుని రాజ్యంలో పాలుపొందుట ద్వారా కలిగే అద్భుత ఆనందాన్ని ఈ *మకారియోస్* సూచిస్తుంది."[6] క్రొత్త నిబంధనలో *మకారియోస్* ఇదే అర్థంతో వాడబడింది. 3వ వచనం మొదటి భాగాన్ని AB ఈ విధంగా వివరిస్తుంది: "ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు (సంతోషంగా, ఆత్మీయంగా ఎదుగుతూ దేవుని కృపయందు, రక్షణలో బాహ్యపరిస్థితులు ఏమయినా, జీవితమంతా ఆనందముతో, తృప్తిగా జీవించడం)." *నిజమైన* సంతోషం, *లోతైన* సంతోషము, చిరకాల సంతోషమును ఈ *మకారియోన్* అనే పదం సూచిస్తుంది. ఇది అంతరంగమును బట్టియే ఉంటుంది. దీన్ని నేను అత్యధిక సంతోషము ("happiness-*plus*")గా పిలుస్తున్నాను.

మీకు సంతోషము కావాలా? అయితే అత్యధిక సంతోషమును పొందుటకు యేసు ప్రభువు ఇచ్చిన ఎనిమిది అవశ్యకతలను మనం ధ్యానిస్తుండగా మీరు మాతోనేనుండండి.[7] ఈ అవశ్యకతలలో మొదటి దానిని గురించి ఈ పాఠములో చెప్పబడింది.

## "ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు ..."

అనేకమందికి కొండమీది ప్రసంగం గురించి తెలుసు కానీ ఆ ప్రసంగాన్ని మొదటిసారి విన్నవారి మీద అది ఏ మాత్రం ప్రభావం చూపించిందన్న విషయం మాత్రం తెలియదు. ప్రభువు చెప్పిన మాటలు విప్లవాత్మకంగా ఉండేవి. ఆయన ప్రతి మాట తరువాత కొంతసేపు ఆగి ప్రజలు ఆ మాటలను గ్రహించిన తరువాత వారు నెమ్మదిగా నున్నప్పుడు తన బోధనను తిరిగి కొనసాగించేవారు. యేసు ప్రభుని మాటలన్నియు యూదుల భావాలకు, ఈ లోక జ్ఞానమునకు విభిన్నముగానుండేవి. అందుకు ఆయన చెప్పిన మొదటి ధన్యతే ఒక చక్కని ఉదాహరణ: "ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు [సంతోషముగలవారు] వారిదే పరలోక రాజ్యం." లోక జ్ఞాన ప్రకారం, ఈ లోకంలో ఒక స్థాయిలో ఉండడానికి, అవసరమైన వాటితో ఈ వాఖ్య విబేధిస్తుంది. యూదుల భావముల ప్రకారం, ఇది వారి సంప్రదాయానికి

విభిన్నమయినది. యూదులు సహజంగానే గర్వపడుతుంటారు. తాము అధికులమనే భావనతో వారు గర్విస్తుంటారు. అటువంటి ప్రజలను ఉద్దేశించి – మనలను ఉద్దేశించి – "ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు" అని ఆయన అంటున్నారు.

### "ఆత్మయందు దీనత్వం" అంటే ఏమి *కాదు*

"ఆత్మ విషయమైన దీనత్వం అంటే ఏమిటి"? "పుస్తకాల విషయంలో దీనులైన వారు ధన్యులు" అని ప్రభువు చెప్పలేదు. ఈ లోకపరమైన విషయాలలో పేదలైనవారు ఆత్మ విషయంలోనూ దీనులైయుంటారన్నది సత్యము (1 కొరింథయులకు 1:26–29 మరియు 1 తిమోతి 6:9ను చూడు), కానీ, పేదరికములోయుండికూడ గర్వించే హృదయం, దూకుడు ఆత్మ కలిగియుండేవారుంటారన్నది కూడ సత్యమే! అలాగే ఆర్థికపరంగా దేవుని చేత ఆశీర్వదింపబడి దేవునిమీద ఆధారపడుతూ, తగ్గింపు స్వభావం కలిగి యుండేవారు కూడ ఉంటారు.[8] కాబట్టి డబ్బే దీనిలో ప్రధాన కారణం కాదు. దేవుడు సమృద్ధిగా కలిగియుండడాన్ని ఖండించలేదు. అలాగే పేదరికాన్ని ఆశీర్వదించనూ లేదు.

"దీన ఆత్మ కలిగిన వారు ధన్యులు" అని కూడ ప్రభువు *చెప్పలేదు.*[9] కొంతమంది తమనుతాము పరిత్యజించుకుని తమను తాము ప్రేమించుకొనక వారు ఆత్మ విషయములో దీనత్వం కలిగియున్నామని భావిస్తుంటారు. రారాజు పిల్లలముగా మనకు ఈ వైఖరి ఉండకూడదు. దేవుని దృష్టిలో ప్రతి ఆత్మ కూడ విలువైనది అని వాక్యం సెలవిస్తుంది (మత్తయి 16:26ను చూడు).

### "ఆత్మ విషయమై దీనత్వం" *అంటే* ఏమిటి

మరి, "ఆత్మ విషయమైన దీనత్వం" అంటే ఏమిటి? "దీనత్వం" అన్న మాటకు ప్రభువు *ptochos* అన్న పదాన్ని వాడారు. *Ptochos* అన్న పదం కేవలం పేదరికాన్ని మాత్రమే సూచించదు. ఇది దిక్కులేనితనాన్ని, పేదిరికంతో కొట్టబడడాన్ని సూచిస్తుంది. ఈ పదమునకు "భయము చేత క్రుంగిపోవడం లేదా భయముచేత దాగుకొనడం" అని అర్థం.[10] "ఒక వ్యక్తి అడుక్కు తినేంతటి పేదరికంలో ఉండడాన్ని"[11] ఇది సూచిస్తుంది. భిక్షకుడైన లాజరును వివరించడానికి ప్రభువు ఇదే పదాన్ని వాడారు. "లాజరు అను ఒక *దరిద్రుడుండెను.* వాడు కురుపులతో నిండినవాడై, ధనవంతుని యింటి వాకిట పడియుండి అతని బల్లమీదనుండి పడు రొట్టె ముక్కలతో ఆకలి తీర్చుకొన గోరెను" (లూకా 16:20, 21ఎ; నొక్కి చెప్పింది నాది). అమెరికాలో మూడు రకాల ప్రజలు ఉన్నారు, ధనవంతులు, పేదవారు ఉన్నారు. అలాగే మాలాంటి "మధ్య తరగతి" వారు ఉన్నారు. కానీ, బైబిలు కాలంలో కేవలం ధనవంతులు మరియు బీధవారు మాత్రమే ఉండేవారు. "కలిగియున్నవారు" అలాగే "ఏమీలేని వారు."[12]

మన వాక్యంలోని *ptochos* అను పదం *కొంచెమే* కలిగియున్నవారి గురించి చెప్పడం లేదు. *అసలేమీ* లేనివారి గురించి ఇది మాట్లాడుతుంది. దారి ప్రక్కన పడియుండి, ఇతరుల దయా దాక్షిణ్యాల మీదనే ఆధారపడి బ్రతికే వారిని గురించిన దృశ్యాన్ని ఇది ఇస్తుంది. తన దగ్గర ఏమిలేదని ఎరిగి తన యెడల ఎవరూ దయచూపకపోతే తనకు మరణమే శరణ్యం అన్న విషయాన్ని ఎరిగియున్న భిక్షకుడిని గురించిన దృశ్యాన్ని ఇది యిస్తుంది. ఈ నాడు మనం పరలోక రాజ్యాన్ని చూడాలంటే నీవు నేను కూడ ఆత్మ విషయమై ఏమీలేని వారమవ్వాలి.

ఇంకాస్త వివరంగా చెప్పాలంటే, "మతపర మరియు నైతిక సామర్థ్యాలలో తమను తాము భిక్షగాళ్ళగా భావించి, తమ ఆత్మ విషయమై తమను తాము పూర్తిగా తగ్గించుకొనువారు ధన్యులు" అని ప్రభువు చెప్తున్నారు. "తమ ఆత్మ విషయమైన అవసరతను గుర్తించువారు ధన్యులు" అని గుడ్‌స్పీడ్ తర్జుమా తెలియజేస్తుంది.

తమ ఆత్మ యొక్క అవసరతను గుర్తించువారిని ప్రభువు ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తున్నాడు. దావీదు యిలా వ్రాస్తున్నాడు, "దహనబలి నీకిష్టమైనది కాదు, విరిగిన మనస్సే దేవునికిష్టమైన బలులు" (కీర్తన 51:17). ఈ వచనం గురించి ఆలోచిస్తే, "మరి దేవుడు పాతనిబంధనలో దహన బలులను కోరాడు కదా!" అని అన్పిస్తుంది. దేవాలయమును ప్రతిష్ట చేసినప్పుడు 120,000 గొర్రెలు, 22,000 ఎద్దులు, మరికొన్ని జంతువులు బలిగా అర్పించబడ్డాయి; "లెక్కింపశక్యము కాని" గొర్రెలను, ఎద్లను బలిగా అర్పించారు (1 రాజులు 8:5; 63 వచనం చూడు). ఇందుకు స్పందించిన దేవుడు దేవాలయమును తన మహిమతో నింపాడు (10 వచనం). అలా అయితే "విరిగిన మనస్సే దేవునికి ఇష్టమైన బలులు" అని దావీదు ఎందుకన్నాడు? ఎందుకంటే, బలిని అర్పించువాడు జంతువును బలిగా అర్పిస్తే అతడు విరిగిన మనస్సుతో వచ్చి ఆయనను స్తుతించి అర్పిస్తేనే అది ఆమోదింపబడుతుంది.

దేవుడు మననుండి ఎటువంటి ఆత్మను కోరుకుంటున్నాడన్న విషయాన్ని యెషయా తెలియజేస్తున్నాడు. సర్వోన్నతుడైన పరిశుద్ధుని అతడు చూసినప్పుడు తను శూన్యమన్న సంగతిని అతడు గ్రహించాడు. "అయ్యో, నేను అపవిత్రమైన పెదవులు గలవాడను; అపవిత్రమైన పెదవులుగల జనుల మధ్యను నివసించువాడను" అని అతడు గ్రహించాడు (యెషయా 6:5). "మీ నీతి క్రియలన్నియు మురికి గుడ్డవలెనాయెను" అని అతడు తరువాత పేర్కొన్నాడు (64:6). పరిశుద్ధుడైన నా దేవునికి నేను ఏం అర్పించగలను అని నన్ను నేను ప్రశ్నించుకుంటే, యెషయా వలెనే నేను కూడ "అయ్యో" అని మాత్రమే అనగలను.

"ఆత్మ విషయమైన దీనత్వం"నకు గల మంచి ఉదాహరణ మనకు పరిసయ్యుడు, సుంకరి ఉపమానములో కనబడుతుంది (లూకా 18:9–14). పరిసయ్యుడు స్వనీతిపరుడు, అతనిలో ఎటువంటి ఆత్మీయ తప్పులు లేవని నమ్మి తనకు ఏ దైవిక సహాయ అవసరం లేదని భావించాడు. సుంకరి ఆత్మ విషయమై దీనత్వమున్నవాడు, అతడు పాపియని, కాబట్టి అతడికి దేవుని కృప అవసరమని అతడు గ్రహించాడు. "దేవా, పాపినైన నన్ను కరుణించుము" అని అతడు ప్రార్థించాడు (13 వచనం). అందుకు ప్రభువు – "అతని కంటె ఇతడు నీతిమంతుడిగా తీర్చబడి తన ఇంటికి వెళ్ళెను" (14ఎ వచనం) అని ముగించారు. పరిసయ్యుడు తాను ఏ కరువు పెట్టిన మంచి పనుల జాబితా తప్పని ఎక్కడా చెప్పబడలేదు గాని, అతడి గర్వ వైఖరి అతనిని తిరస్కరింపబడేలా చేసింది. ఒక వ్యక్తి నైతిక విషయములో మంచిగా ఉండవచ్చు. వ్యాపారములో నిజాయితీగ ఉండవచ్చు, దాతృత్వము కలిగియుండవచ్చు, అయినాగాని "ఆత్మయందు దీనత్వం" కలిగియుండలేకపోతే అతడు దేవుని చేత తిరస్కరింపబడవచ్చు.

### "... వారిదే పరలోక రాజ్యము"

"ఆత్మ విషయమైన దీనత్వము" గురించి తెలుసుకున్న తరువాత, "ఇటువంటి ఆత్మ నిజమైన సత్యమైన, శాశ్వత సంతోషమునకు ఎలా సంబంధించి యుంటుంది?" అని ప్రశ్నించాలి. ఆత్మయందు దీనత్వం కలిగియుండడం ద్వారా ఒక వ్యక్తి సంతోషాన్ని

కనుగొనగలడు. చాలామంది తమ ఆశలు, ఆశయాలకు తగ్గట్టుగా జీవించలేరు కాబట్టి వారు దుఃఖాక్రాంతులైయుంటారు. ఆత్మయందు దీనత్వం కలిగిన వ్యక్తి నిజాయితీగా తనను తాను పరిశీలించుకుంటే, తనయందు కాక దేవునియందే తన నమ్మకాన్ని ఉంచుతాడు. తద్వారా దేవుడతన్ని కృంగిపోనివ్వడు. ఆత్మయందు దీనత్వం కలిగినవారు దీనులైయుండడానికి గల ప్రధాన కారాణాన్ని మన వాక్య భాగంలో వెదికితే, వారికి ఒక వాగ్దానం యిక్కడ ఇయ్యబడింది. "పరలోక రాజ్యము వారిది." ఈ లోకంలోని పరిస్థితులు ఎలా ఉన్నాగాని, ఈ వాగ్దానం వారిని మరింత ప్రోత్సాహపరుస్తుంది.

## "పరలోక రాజ్యము" అంటే ఏమిటి?

ఇది "పరలోకరాజ్యము అంటే ఏమిటి?" మరియు "ఆత్మ విషయమై దీనులైనవారు దీనిని ఎలా పొందగలరు?" అన్న ప్రశ్నలకు దారితీస్తుంది. మొదటి ప్రశ్నను గమనిద్దాము: "పరలోక రాజ్యము అంటే ఏమిటి?"

ధన్యతలలోని కొన్ని వాగ్దానాలు యిహలోక జీవితానికి సంబంధించియుండగా మరికొన్ని రాబోయే రాజ్యమును గురించినవి. ఈ వాగ్దానాలన్నీ కొంతవరకు ఇక్కడే నెరవేర్చబడగా వాటి సంపూర్ణ నెరవేర్పు రాబోయే రాజ్యములో ఉంటుందని నేను *ఇదివరకే* ప్రస్తావించాను. ఇది మామూలు సంతోషంవంటిది కాదు. దేవుని పిల్లలకు ఈ సంతోషం కొంతవరకు ఉన్నాగాని, ఈ పాపపు లోకములోని దుఃఖము, శ్రమలతో కలసి ఉన్నందున ఇది సంపూర్ణముగా అనుభవములోనికి రాదు. రాబోయే రాజ్యములో ఏమో మిశ్రమం లేనందున సంపూర్ణ సంతోషము మనకుంటుంది. ఇక్కడ, అలాగే రాబోయే రాజ్యమునకు సంబంధించిన నెరవేర్పు "పరలోక రాజ్యము వారిది" అన్న వాగ్దానమునకు సంబంధించియుంది.

"రాజ్యము" (*basileia*) అన్న పదం "సార్వభౌమాధికారాన్ని, రాజ్యాధికారాన్ని, ప్రభుత్వమును" సూచిస్తుంది. సవివరంగా చెప్పాలంటే, ఇది "ఒక సంస్థానము లేదా రాజు ఆధీనములోనున్న ప్రజలను"[13] సూచిస్తుంది. దేవుని పరిపాలనను, దేవుని రాజ్యము సూచిస్తుంది. "రాజ్యము" అన్న పదమునకు గల రెండు ప్రాథమిక అర్థాలను క్రొత్త నిబంధనలో సూస్తాము. మొదటిది, క్రీస్తు, దేవుడు, ఈ భూమి మీద పరిపాలించే ప్రజల గుంపు, వీరు సంఘముగా పిలువబడుతున్నారు. మత్తయి 16:18, 19లో ప్రభువు "రాజ్యము" మరియు "సంఘము" అను మాటలను ఒకదాని తర్వాత ఒకటి వాడారు. మన పాపములనుండి మనం రక్షింపబడినప్పుడు దేవుడు మనలను తన సంఘమునకు చేరుస్తాడు (అపొస్తలుల కార్యములు 2:47; KJV)[14] – దీనినే మరో విధంగాను చెప్పవచ్చు. దేవుడు మనలను "తన ప్రియకుమారుని రాజ్యములోనికి" చేరుస్తాడు (కొలొస్సయులకు 1:13). అప్పుడు, ఫ్రెడరిచ్ నైట్జేక్ ప్రకారం, "నీవు ఏమైయున్నావో *అదే* అవుతావు."[15] మనము దేవుని రాజ్యములో పౌరసత్వమును అనుభవించినా గానీ, ఆయన పరిపాలన మన హృదయములో మరింతగా జరిగేలా మనమాయన్ను ఆహ్వానించాలి.

"రాజ్యము" అన్న పదమునకు క్రొత్త నిబంధనలో మనకు కనబడుతున్న రెండవ ప్రాథమిక అర్థము. దేవుడు మరియు క్రీస్తు పరిపాలించే పరలోక ప్రాంతము (2 తిమోతి 4:18ను చూడు) – దీన్నే మనం "పరలోకం" అని పిలుస్తున్నాం.[16] మన వాక్య భాగంలో చెప్పబడినట్టుగా "ఆత్మయందలి దీనత్వం" గలవారే దేవుని సంఘములో సభ్యులుగా ఉండగలరు అలాగే వారికి

మాత్రమే పరలోకపు నిరీక్షణ ఇయ్యబడుతుందని నేను నమ్ముతున్నాను. దేవుని సంఘములో సభ్యులైన వారికి చేయబడిన వాగ్దానాలు, అలాగే పరలోకపు నిరీక్షణ యున్నవారికి ఇయ్యబడే వాగ్దాన ఫలములు వారికి తప్పనిసరిగా సంతోషాన్ని కలిగిస్తాయి.

### "ఆత్మ విషయమై దీనత్వం" కలిగియుండడం ద్వారా మనం పరలోక రాజ్యాన్ని ఎలా పొందగలం?

మన రెండవ ప్రశ్నయైన "ఆత్మ విషయమై దీనత్వం కలిగియుండడం ద్వారా మనం పరలోక రాజ్యాన్ని ఎలా పొందగలం?" అన్న ప్రశ్నను చూద్దాము. "రాజ్యము"; అన్న పదమునకు గల ప్రాథమిక అర్థాన్ని గుర్తుపెట్టుకోండి. ఇది దేవుని పరిపాలనకు సంబంధించినది. ఏ వ్యక్తీ కూడ ముందుగా తనను తాను త్రోసివేసుకుంటేనే గాని దేవున్ని తన హృదయ సింహాసనం మీద కూర్చొనపెట్టలేడు.

క్రొత్త నిబంధనల "రాజ్యము" అన్న పదమునకు గల రెండు ప్రాథమిక అర్థాలను గమనించండి: ఇది సంఘాన్ని అలాగే పరలోకాన్ని గురించి చెబుతుంది. *మొదటిగా, దేవుని సంఘములో చేర్చబడుటకు ఆత్మ విషయమైన దీనత్వం ఎంత అవసరమో చూద్దాము.* క్రీస్తు రక్తము చేత రక్షంపబడిన వారి సమూహమే సంఘము (ఎఫెసీయులకు 5:23, 25ను చూడు). అటువంటి రక్తము చేత రక్షింపబడాలంటే మనం ఏం చేయాలన్న విషయమై "ఐదువ్రేళ్ళ అభ్యాసమును" పిల్లలకు నేర్పుతారు. మనం వినాలి, నమ్మాలి, పశ్చాత్తాపపడాలి, ఒప్పుకోవాలి మరియు బాప్తిస్మం పొందాలి.[17]

ఒక వ్యక్తి తాను ఆత్మీయంగా దీన స్థితిలోనున్నాడని *ఎరిగియుంటేనే* గాని అతడు సువార్తను వినలేడు (రోమీయులకు 10:17 చూడు). ఒక వ్యక్తి ఆత్మీయంగా తాను మంచి స్థితిలోనున్నాడని భావించినంత కాలం అతడిలో రక్షణకొరకైన మంట పుట్టదు, అలాగే ఒక వ్యక్తి, తన నీతి క్రియలనే *నమ్ముకున్నంత* కాలం అతడు దేవునియందు విశ్వాసముంచ లేడు. అలాగే తన విశ్వాసాన్ని *ఒప్పుకొనలేడు* (యోహాను 3:16; రోమీయులకు 10:9, 10 చూడు). *పశ్చాత్తాపం* సంగతి ఏంటి? తను సంతృప్తికర స్థితిలోనున్నాడని నమ్మే వ్యక్తి తాను పశ్చాత్తాపపడవలసిన అవసరం ఉందని నమ్మడు.

ఒక వ్యక్తి, తాను రక్షింపబడడానికి దేవుని కృప మీదనే ఆధారపడినప్పుడే అతడు బాప్తిస్మం పొందుటకు సిద్ధపడగలడు (అపొస్తలుల కార్యములు 2:38, 41, 47). ఇతరులు బాప్తిస్మం పొందుతున్నారని లేదా ఇతరులు బలవంతపెడుతున్నారని బాప్తిస్మం పొందే వ్యక్తి నిజానికి ఆత్మీయంగా బాప్తిస్మం పొందినట్లు కాదు. ఒక మంచి వ్యక్తిని చూసి, "అతడు ఇక బాప్తిస్మం తీసుకుంటే సరిపోతుంది" అని చెబుతుంటారు. కానీ, అలా కాదు, తన మంచితనం గాకుండా, దేవునికి అర్పించుటకు తన వద్ద ఏమీ లేదని, ఆత్మ విషయై తాను శూన్యమని అతడు గ్రహించాలి. కేవలం అప్పుడు అతడు దేవుని యొద్దకు దీనత్వముతోను, విధేయతతోను రాగలడు.

చివరిగా, క్రొత్త నిబంధనలో "రాజ్యము" అన్న పదమునకు గల రెండవ *ప్రాథమికమైన* పరలోకమును గమనించుదాము. "మరణము వరకు నమ్మకముగా ఉండుము. నేను నీకు జీవ కిరీటమిత్తును" అని ప్రభువు చెప్తున్నాడు (ప్రకటన 2:10). ఎవరైనా ఆత్మయందలి దీనత్వం కలిగియుంటేనే నమ్మకమైన క్రైస్తవ జీవితాన్ని గడపగలరు. ప్రభువు లవొదికయ

సంఘాన్ని పరీక్షించి “నీవు దౌర్భాగ్యుడవును, దిక్కుమాలినవాడవును దరిద్రుడవును గ్రుడ్డివాడవును దిగంబరుడవై యున్నావని యెరుగక - నేను ధనవంతుడను, ధనవృద్ధి చేసియున్నాను. నాకేదియు కొదువ కాలేదని చెప్పుకొనుచున్నావు” (ప్రకటన 3:17) అని అంటున్నాడు. వారికేమీ కొదువలేదని వారు అనుకున్నారు నిజానికి, వారికి అంతయు కొదువగానేయున్నది.

## ముగింపు

“ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు. పరలోక రాజ్యము వారిది.” మనం ధన్యులము కావాలంటే దేవుని ఆశీర్వాదాల్ని పొంది, అనుభవించాలి. అప్పుడు ఈ లోక పరిస్థితులు/కష్టాలు ఎన్ని వచ్చినా మనం నిజముగా, సంతోషముగా ఉంటాము. “ఆత్మయందలి దీనత్వం” కలిగి ఉండాలంటే, ఒక వ్యక్తి తాను ఆత్మీయంగా శూన్యమని దేవుని కృప, దయ మీదనే పూర్తిగా ఆధారపడిన భిక్షకుడని గుర్తించాలి. “పరలోక రాజ్యము” సంఘములోను మరియు పరలోకములోను దేవుని పాలనను సూచిస్తుంది. మనం ఇవ్వగలిగిన ముగింపు ఏమిటి? ఇప్పుడు, పరలోకంలోనూ దేవుని ఆశీర్వాదాలను మనం పొందుకోవాలంటే మనం “ఆత్మ విషయమై దీనత్వం” కలిగియుండాలి. “రాక్ ఆఫ్ ఏజస్” అన్న ఇంగ్లీషు పాటలో చెప్పబడిన ప్రకారం మన వైఖరి ఉండాలి:

> నేను వస్తూ ఏమీ తేలేదు:
> నీ సిలువనే నేను శరణుజొచ్చియున్నాను;
> దిగంబరినై, వస్త్రము కొరకు నీయొద్దకు వస్తున్నాను;
> అసహాయకుడనై నీ కృప కొరకు వేచియున్నాను;
> దుర్మార్గుడనై నీ పర్వతమునకు ఎగిరి వస్తున్నాను:
> ప్రభువా, నన్ను శుద్ధిచేయుము, లేనియెడల నేను నశించిపోదును.[18]

నేను “ఆత్మయందలి దీనత్వమును” కలిగియున్నానా? అని మనమందరము ప్రశించుకోవాలి. ఆత్మయందలి దీనత్వము అన్న మాటకు వ్యతిరేక పదం ఆత్మయందలి ధనికుడైయుండడం “ఆత్మలో సమృద్ధి కలిగియుండడం,” ఆత్మ విషయమై సంతృప్తిగా ఉండడం. లూకా 6వ అధ్యాయములో ఈ ధన్యతను గురించి నకారాత్మక మరియు సకారాత్మక ధోరణులను ప్రభువు ఇస్తున్నారు. “బీదలైన మీరు ధన్యులు, దేవుని రాజ్యము మీది.” “అయ్యో ధనవంతులారా, మీరు (కోరిన) ఆదరణ మీరు పొందియున్నారు” (20, 24 వచనాలు). ఆర్థికంగా పేదలైనవారు ప్రభువును తమలోనికి చేర్చుకుంటారన్న ఉద్దేశము ఇక్కడ కలుగుతున్నాగాని (చూడు మార్కు 12:37; KJV), దీని యొక్క సంపూర్ణ భావము మత్తయిలోని ధన్యతలో కనబడుతుంది. కొంతమంది తమ ఆత్మీయ విషయములో “దీనులై” యుండగా, కొంతమంది ధనికులైయుంటారు. తమ ఆత్మయందు గర్వము కలిగియున్న ఆత్మీయ ధనికులు తమ ఆదణరకు ఇప్పటికీ ఈ లోకములోనే సంపూర్ణంగా పొందియున్నారు గనుక రాబోవు నిత్యత్వములో శూన్యులైయుండబోతున్నారు. ఎంత విచారకరం!

అన్ని పనులను మనకు మనమే చేయలేమని మనకు సహాయం కావలెనని కొంతమంది అంగీకరించరు. నా చిన్నతనంలో జరిగిన భయానక సంఘటనలు నాకు గుర్తుకు వస్తున్నాయి. నాకు ఆ పనిని ఎలా చేయలో తెలియకపోయినా, నాకు అంతా తెలుసని, నాకు ఎవరి

సహాయం అవసరం లేదని నాకై నేను విపత్తులను కొనితెచ్చుకున్నాను. మీరును నశించి పోకూడదని నేను మిమ్ములను వేడుకుంటున్నాను. మీరు దేవుని కృప, ఆయన సహాయం లేకుండా రక్షింపబడలేరని ఒప్పుకొనుటకు మీకు మీ గర్వం అడ్డువస్తుంది నీ ఆత్మీయ హీన స్థితిని, దీన పరిస్థితిని గుర్తించండి. అప్పుడు దీనత్వముతో ప్రభువు యొద్దకు రండి, మీకు దేవుని ప్రేమ అవసరముగానుంటే – ఈనాడే ఆయన వద్దకు రండి.

---

సూచనలు

[1]ప్రసంగానికి ముందు మత్తయ 5:1–12 వాక్య భాగాన్ని ఒకరిని బిగ్గరగా చదవమంటాను. తరువాత, "మనము ఇంతకు ముందు వాక్య భాగములో ..." అని ప్రారంభిస్తాను. [2]Hugo McCord, *Happiness Guaranteed* (Murfreesboro, Tenn.: Dehoff Publications, 1956). [3]Ken Palmer, "Beatitudes" (http://www.lifeofchrist.com/teaching/sermons/mount/beatitudes.asp; Internet; accessed 10 April 2008); James M. Tolle, *The Beatitudes* (Fullerton, Calif.: Tolle Publications, 1966), 6. [4]C. G. Wilke and Wilibald Grimm, *A Greek-English Lexicon of the New Testament,* trans. and rev. Joseph H. Thayer (Edinburgh: T. & T. Clark, 1901; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1977), 386. [5]*The American Heritage Dictionary,* 4th ed. (2001), s.v. "happy." [6]Geoffrey W. Bromiley, *Theological Dictionary of the New Testament,* ed. Gerhard Kittel and Gerhard Friedrich; trans. Geoffrey W. Bromiley, abr. (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 548. (Emphasis mine.) [7]కొంతమంది ఏడు ధన్యతలు అంటే కొంతమంది తొమ్మిది ధన్యతలు అని లెక్కిస్తారు. [8]దీనికి అబ్రహామును ఉదాహరణగా చెప్పవచ్చు. [9]"ఆత్మయందు దీనత్వం" మరియు "దీన ఆత్మను కలిగియుండడం" మధ్య గల వ్యత్యాసాన్ని అంత సులభంగా నిర్ణయించలేము. ప్రేరేపణతో వ్రాసిన గ్రంథకర్తలు తమను తాము శూన్యముగా ఎంచుకున్నారని కొన్ని వ్యాఖ్యాలు తెలియజేస్తున్నాయి. పరిశుద్ధమైన దేవునితో పోల్చుకుంటే, మనం ఏమీలేనివారము. కానీ ప్రేమగల మన తండ్రికి మనం అమూల్యము. [10]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 56.

[11]Bromiley, 969. [12]ఈనాటికి ప్రపంచంలో అనేక చోట్ల యిలా ఉంది. [13]Vine, 344. [14]అపొస్తలుల కార్యములు 2:47లో, KJVలో సంఘం అని పేర్కొనబడింది. ఇతర తర్జుమాలో అలా లేదు కానీ లూకా మనసులో సంఘం అని ఉంది. [15]జర్మనీ తాత్వికవేత్త Friedrich Nietzsche చేత ప్రాచుర్యం పొందిన మాట తొలిసారిగా అది గ్రీకు కవి Pindar చేత వాడబడింది (Tony Hale: "Become Who You Are: The Freedom to Create" [http://www.anonymityone.com/Faq97.htm]; Internet; accessed 24 April 2008). [16]"దేవుని రాజ్యము" సంఘమును సూచిస్తుండగా, "పరలోక రాజ్యము" పరలోకమును సూచిస్తుందని చెప్తారు. కానీ క్రొత్త నిబంధనలో ఈ రెండు పదాలు పర్యాయ పదాలుగా వాడబడ్డాయి. (ఉదాహరణలకు మత్తయి 19:23, 24ను చూడు). గ్రంథకర్త మనసులో "భూమిపై" ఉన్న ఆత్మ సంబంధమైన రాజ్యం ఉందా లేక "పరలోక రాజ్యము" ఉందా అన్న విషయాన్ని గ్రహించుటకు వాక్య నేపథ్యం సహాయపడుతుంది. [17]చేతి వ్రేళ్ళ అభ్యాసాన్ని నేను పిల్లలకు నేర్పించాను. నా చేతి చూపుడు వ్రేళ్ళను సిలువ ఆకారంలో ఉంచి యేసు మనకొరకు సిలువలో చనిపోయాడని చెప్పాను. తరువాత ఒక చేతి వ్రేళ్ళను మరో చేతితో కొట్టి తెరుస్తూ, "ఇప్పుడు మనం వినాలి, నమ్మాలి, పశ్చాత్తాపపడాలి, ఒప్పుకోవాలి, బాప్తిస్మం పొందాలి" అని చెప్పాను. తరువాత రెండు చేతులను కలిపి ఒక్కోసారిగా తెరుస్తు పైకెత్తి "మనం ఎదగాలి" అని చెప్పాను. దీన్ని చాలాసార్లు చేసి పిల్లలచేత చేయిస్తాను. [18]A. M. Toplady, "Rock of Ages," *Songs of Faith and Praise,* comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994).

---

## మత్తయి 5:3-12లో ఉన్న ధన్యతలు ఏడా, ఎనిమిదా లేక తొమ్మిదా?

*"ఏడు"* అనే సంఖ్య ప్రముఖమైనది, సంపూర్ణమైనది కాబట్టి కొంతమంది ధన్యతలు ఏడే ఉన్నాయని చెబుతారు. ఇందుకు వారు, 3 మరియు 10 వచనాలలోని వాగ్దానము ఒకటే కాబట్టి, 10వ వచనం, 3వ వచనానికి కొనసాగింపు అని చెబుతారు. మరికొంతమంది, "ధన్యులు" అన్నమాట ఈ వాక్య భాగంలో *తొమ్మిదిసార్లు* ఉంది కాబట్టి ధన్యతలు తొమ్మిది అని

చెబుతారు. ఇందుకు వారు 11, 12 వచనాలను 10వ వచనం నుండి వేరుచేసి తొమ్మిదవ ధన్యతగా చెబుతారు కానీ ఎక్కువమంది వేదాంతవేత్తలు ధన్యతలు *ఎనిమిదేనని* లెక్కవేశారు. మనమిక్కడ దీనినే అధ్యయనం చేస్తాం. ఏదిఏమైనా, ధన్యతల యొక్క సందేశము మనకు ముఖ్యము కానీ సంఖ్యకాదు.